సాక్షి
పెద్దపల్లి
మంగళవారం : 1 : జూలై : 2025



హామీలు అమలు చేయాలి

రామగిరి: కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు కోరారు. ఈమేరకు స్థానిక అమర వీరుల స్తూపం ఎదుట నిరాహారదీక్ష చేపట్టారు.



వంతెన కోసం స్థల పరిశీలన

మంథని: బోయిన్‌పేట-గంగాపురి మధ్య బొక్కలవాగుపై హైలెవల్ వంతెన నిర్మాణానికి నీటిపారుదల ఈఈ బలరామయ్య స్థలపరిశీలన చేశారు. అధికారులు పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం
30.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరుగుతుంది. జిల్లాలోని పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మెరుగైన బోధన చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలను సాధించేందుకు నాణ్యమైన బోధన చేయాలని కలెక్టర్ శ్రీహర్ష ఆదేశించారు. పలువురు హెచ్‌ఎంలతో ఆయన సోమవారం కలెక్టరేట్‌లో సమావేశమై పలు సూచనలిచ్చారు. విద్యాప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. కనీసం 90శాతం విద్యార్థులకు చదవడం, రాయడం, బేసిక్ మ్యాథ్స్ అర్థం కావాలని తెలిపారు. మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉండేలా చూడాలని సూచించారు. డీఈవో మాధవి, సమన్వయ అధికారి పీఎంషేక్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అధికారులకు సన్మానం



పోలీస్ అధికారులతో సీపీ అంబర్ కిశోర్ ఝా

గోదావరిఖని: ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా సోమవారం తన కార్యాలయంలో సన్మానించారు. ఇందులో ఎస్‌ఐ వెంకటేశ్వర్‌రావు, ఎన్.చంద్రశేఖర్, ఎం.అంజయ్య ఉన్నారు. అడిషనల్ డీసీపీ రాజు, స్పెషల్ బ్రాంచ్, ఏఆర్ ఏసీపీలు మల్లారెడ్డి, ప్రతాప్, ఏవో శ్రీనివాస్, సీసీఆర్‌బీ సీఐ సతీశ్, ఆర్‌ఐలు దామోదర్, మల్లేశం, వామనమూర్తి ఉన్నారు.

గోరింటాకు సంబురం



గోరింటాకు అలంకరించుకున్న మహిళలు

మంథని: ఆషాఢ మాసంలో తొలివారం సందర్భంగా మంత్రపురిలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయంలో సోమవారం గోరింటాకు సంబురాలు ఘనంగా జరుకున్నారు. పట్టణానికి చెందిన బండారి సునీత ఆధ్వర్యంలో విష్ణులలిత పారాయణ మహిళలు ప్రత్యేకంగా గోరింటాకు తయారు చేసుకున్నారు. లక్ష్మీనారాయణ స్వామి, లక్ష్మీదేవి, గోదాదేవి అమ్మవార్ల చేతులకు గోరింటాకు అలకరించారు. ఆషాఢంలో గోరింటాకు అలంకరించుకుంటే అనేక ప్రయోజనాలు ఉంటాయని ఆమె పేర్కొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి



ప్రొసీడింగ్స్ అందిస్తున్న ఎమ్మెల్యే

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారులను గెలిపించి సత్తా చాటాలని ఎమ్మెల్యే విజయరమణారావు కోరారు. ఐతరాజుపల్లి, భూపతిపూర్, గొల్లపల్లి, నారాయణారావుపల్లి, సాంబయ్యపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే సోమవారం సుడిగాలి పర్యటన చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ముగ్గు పోశారు. ప్రొసీడింగ్స్ అందజేసి మాట్లాడారు. కాంగ్రెస్ మద్దతుదారులను గెలిపిస్తే గ్రామాలు సంపూర్ణ అభివృద్ధి చెందుతాయని తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్యగౌడ్, ఏఎంసీ చైర్మన్ ప్రకాశ్‌రావు, ఎంపీడీవో దివ్యదర్శన్, నాయకులు సతీశ్, రాములు, తిరుమల్‌రావు, జాని, వెంకన్న, రాజిరెడ్డి, చక్రపాణి, రాజు, బక్కయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేపు క్రికెట్ జిల్లా జట్టు ఎంపిక

గోదావరిఖనిటౌన్: మహిళా క్రికెట్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు ఈనెల 2న ఉదయం 9 గంటలకు గోదావరిఖని జీఎంకాలనీ గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్లు క్యాంప్ జిల్లా ఇన్‌చార్జి కిరణ్‌కుమార్ యాదవ్ తెలిపారు. సుధాకర్ ఆధ్వర్యంలో ఎంపిక పోటీలు ఉంటాయని పేర్కొన్నారు.

పిల్లల చేయిపట్టి..
సర్కార్ బడికి జైకొట్టి

• తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించిన టీచర్లు • స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్న ఉద్యోగులు



ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం.. గవర్నమెంట్ టీచర్లపై భరోసా పెంచాలనే పలువురు ఉపాధ్యాయులు తమ పిల్లలను సర్కార్ బడికి పంపుతున్నారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యాబోధన ఉంటుందని చెప్పేందుకే తాము పనిచేస్తున్న స్కూళ్లకు పిల్లలను తీసుకెళ్తున్నారు. సార్లే.. తమ పిల్లలను ఊరిలోని బడికి తీసుకొస్తుంటే.. మిగతా తల్లిదండ్రులు తమ పిల్లలనూ చేర్పిస్తున్నారు. ఇటీవల ఉపాధ్యాయులు చేపట్టిన బడిబాటలో విద్యార్థుల సంఖ్య పెరగడానికి ఇదే కారణం. తమ పిల్లలను సర్కార్ బడికి పంపుతున్న ఉపాధ్యాయులు ఆదర్శంగా నిలుస్తున్నారు.



కొడుకు అయాన్ అద్వైత్‌కు పుస్తకాలు అందజేస్తున్న తండ్రి భూక్య తిరుపతి

బడిపై నమ్మకం కల్పించాలని

రుద్రంగి(వేములవాడ): తన ముగ్గురు పిల్లలనూ సర్కార్ స్కూళ్లలోనే చదివిపిస్తున్నారు రాజన్నసిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం వీరునితండాకు చెందిన టీచర్ భూక్య తిరుపతి. రుద్రంగి ప్రైమరీ స్కూల్‌లో టీచర్‌గా విధులు నిర్వర్తిస్తున్న భూక్య తిరుపతికి భూక్య ప్రీతిజ, భూక్య నిహారిక, భూక్య అయాన్ అద్వైత్ పిల్లలు. నిహారికను గతంలో తాను పనిచేసిన రుద్రంగి ప్రైమరీ స్కూల్‌కు తీసుకెళ్లేవారు. ప్రస్తుతం మానాలలోని స్కూల్‌లో విధులు నిర్వర్తిస్తున్న తిరుపతి తన కొడుకు అయాన్ అద్వైత్‌ను అదే పాఠశాలకు వెంట తీసుకెళ్తున్నారు. ఇద్దరు కూతుళ్లు భూక్య ప్రీతిజ 10వ తరగతి, భూక్య నిహారిక 7వ తరగతి.. గురుకులాల్లో చదువుతున్నారు.

తల్లిదండ్రుల బడికి కొడుకు

కథలాపూర్(వేములవాడ): కథలాపూర్ మండలం దుంపేటకు చెందిన గుండేటి రవికుమార్-పద్మలత దంపతులు ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులు. వీరు మండలంలోని పోసానిపేట ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ దంపతుల చిన్నకుమారుడు లౌకిక్ నాలుగో తరగతి వారు పనిచేస్తున్న పోసానిపేట ప్రభుత్వ పాఠశాలలోనే చదువుతున్నాడు. నిత్యం తమ వెంటే స్కూల్‌కు తీసుకెళ్తున్నారు. వీరిని చూసి గ్రామంలోని తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను పాఠశాలకు పంపడంతో విద్యార్థుల సంఖ్య పెరిగింది.

తల్లిదండ్రులకు విశ్వాసం కల్పించాలని..



పిల్లలతో స్రవంతి

సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రాంనగర్‌కు చెందిన స్రవంతి కరీంనగర్‌రూరల్ మండలం చెర్లభూత్కూర్‌లోని జెడ్పీ హైస్కూల్‌లో మ్యాథ్స్ టీచర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. స్వస్థలం పెద్దపల్లి జిల్లా ధూళికట్ట కాగా కరీంనగర్‌లో నివాసముంటున్నారు. భర్త శ్రీకాంత్ ల్యాబ్ టెక్నీషియన్. కూతురు అమూల్య 6వ తరగతి, కుమారుడు సాయిమోక్షిత్ 4వ తరగతి చదువుతున్నారు. గతంలో వీరు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు స్కూల్‌లో చదువగా.. ప్రస్తుతం తల్లి వెంటే చెర్లభూత్కూర్ ప్రభుత్వ బడికి వెళ్తున్నారు. గ్రామంలోని తల్లిదండ్రులకు ప్రభుత్వ బడిపై నమ్మకం కల్పించేందుకు తన పిల్లలనూ అక్కడే చదివిపిస్తున్నట్లు టీచర్ స్రవంతి తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలోనే పిల్లలు



బైక్‌పై పాఠశాలకు తీసుకొస్తున్న అనిల్‌కుమార్

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం మండలం న్యూమారేడుపాక లోని నర్సింహపురం(ఎంపీపీఎస్) ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయుడు వి.అనిల్‌కుమార్ తన ఇద్దరు కుమారులను అదే పాఠశాలలో చదివిపిస్తున్నారు. పెద్దకుమారుడు శ్రీహాన్ 5వ తరగతి, చిన్నకుమారుడు 2వ తరగతి చదువుతున్నారు. వారిద్దరిని నిత్యం తనతోపాటు బైక్‌పై ప్రభుత్వ బడికి తీసుకొస్తున్నాడు. తను పనిచేస్తున్న పాఠశాలలోనే ఇద్దరు పిల్లలను చదివిపిస్తూ.. గ్రామంలోని తల్లిదండ్రుల్లో నమ్మకం పెంచినట్లు టీచర్ అనిల్‌కుమార్ తెలిపారు.

- వివరాలు 8లో▸

మురికికూపాలు

• బల్దియాల్లో అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ • రోడ్లపై నీరు పారుతున్నా పట్టించుకోని వైనం
• ఏటా వర్షాకాలంలో ప్రజలకు తప్పని తంటాలు • వ్యాధులకాలంలో కనిపించని ముందస్తు చర్యలు



• ఈ చిత్రం మురికివాడలోది అనుకుంటే పొరపాటే. రామగుండం బల్దియాలో నిర్మించిన ఖరీదైన భవనాల ఎదుట పారుతున్న మురుగు. గోదావరిఖని శ్రీదుర్గానగర్‌కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైపులు, మ్యాన్‌హోల్స్ పగిలి మురుగు సాఫీగా పారడం లేదు. జనావాసాల్లోనే వరదలా పారుతోంది. ఇది ఒకరోజు, వారంరోజుల సమస్య కాదు.. ఏడాదిగా కాలనీవాసులు నరకయాతన పడుతూనే ఉన్నారు. దీని ద్వారా దోమలు, ఈగలు వృద్ధి చెంది కాలనీ కంపు కొడుతోంది. వర్షాలతో పరిస్థితి మరింత అధ్వానంగా మారింది.



సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

పెద్దపల్లి సాగర్ రోడ్డులో పూడికతో నిండిన కాలువ



పెద్దపల్లిలోని కూనారం రోడ్డులో జనావాసాల్లోనే మురుగునీరు



• అధ్వానంగా ఉన్న మురుగు లీకేజీతోపాటు పందులు స్వైరవిహారం చేస్తున్న ఈ చిత్రం గోదావరిఖని ఇందిరానగర్ కల్లు డిపో ఎదుటి ప్రాంతం. మ్యాన్‌హోల్ పగిలి మురుగు రోడ్డుపై ఇలా పారుతోంది. ఇందులోనే పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. వీటిద్వారా మెదడువాపు వ్యాధితోపాటు మురుగుతో డెంగీ, మలేరియా ప్రబలే ప్రమాదం పొంచి ఉంది.



• ఇది సుల్తానాబాద్ శాస్త్రీనగర్‌లోనిది. మురుగునీటి కాలువలేదు. రాజీవ్‌రహదారిపైనే మురుగు పారుతోంది. కాలువలు నిర్మించక ఈ దుస్థితి తలెత్తింది. తరచూ బురద చేరుతుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



• ఇది మంథని మున్సిపల్‌లోని పద్మశాలీ వీధిలోని మురుగునీటి కాలువ. పూడిక తీయక.. రోడ్డు వెంట వెళ్లే వర్షపునీరు ఇలా ఇళ్లలోకి చేరుతోంది. కొన్ని వీధుల్లో ఇటీవల అండర్ గ్రౌండ్, ఓపెన్ డ్రైనేజీలు నిర్మించినా.. సక్రమంగా లేవు. చిన్నవర్షానికే వర్షపునీరు రోడ్ల వెంట పారుతోంది. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని కాలువలు సక్రమంగా లేవు. వర్షపునీరు బస్టాండ్‌లోకి చేరుతోంది. ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.



• ఇది గోదావరిఖని మార్కండేయకాలనీ శివాలయం సమీపంలోని మేజర్ నాలా. నాలా నిర్మాణానికి గతంలోనే టెండర్ కూడా పిలిచారు. పనులు పూర్తి చేయకుండా ఇలా నిర్లక్ష్యంగా వదిలేశారు. ఫలితంగా సమీప కుటుంబాలు మురుగు దుర్వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. కాలువలోంచి పాములు, తేళ్లు ఇళ్లలోకి వస్తున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు ఇటీవల పిచ్చిమొక్కలు మొక్కుబడిగా తొలగించి చేతులు దులుపుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి.



• డ్రైనేజీ నిండి పొంగిపారుతున్న ఈ దృశ్యం జిల్లా కేంద్రంలోని భూమ్‌నగర్‌లోనిది. పలుకాలనీల్లోని డ్రైనేజీల్లో రోజూ పూడికతీయక, ము రుగు ఇలా రోడ్లు, ఇళ్లలోకి చేరుతోంది. దుర్వాసన రావడంతో స్థానికులు భరించలేకపోతున్నారు.

సాక్షి, పెద్దపల్లి: బల్దియాల్లో మురుగునీటి పారుదల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. చాలాకాలనీల్లో మురుగునీరు బయటకు వెళ్లేమార్గం లేకుండా పోయింది. దీంతో పల్లపు ప్రాంతాల్లో నిలిచి కాలనీలు మురికూపాలుగా మారుతున్నాయి. ప్రధాన కాలువల్లో పూడిక తొలగించక, పలుచోట్ల కబ్జాకు గురవడ, మరికొన్నిచోట్ల కాలువలే లేక మురుగు రోడ్లపైకి వస్తోంది. ఫలితంగా దోమలు, దుర్వాసన భరించలేకపోతున్నారు. వర్షాకాలం కావడంతో జ్వరాలు, డెంగీ తదితర వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది.

కనిపించని కాలువలు

రామగుండం నగరంతోపాటు పట్టణాల్లో ప్రధానంగా డ్రైనేజీల సమస్య వేధిస్తోంది. మున్సిపాలిటీల్లోని పాత వార్డుల్లో డ్రైనేజీలు ఉన్నా.. పూడిక తీయక సమస్యలు వస్తున్నాయి. ఐదేళ్లు గడిచినా.. విలీన కాలనీల్లో పారిశుద్ధ్యం మెరుగుపడలేదు. కొత్త కా లనీల్లో వీటి ఊసేలేదు. జనావాసాలు, ఖాళీస్థలాల్లో నీరు నిలిచి ఉంటోంది. కాలువలు ఉన్నచోట నిర్వహణ కరువై, ధ్వంసమైన చోట మరమ్మతులు లేక వ్యర్థ జలాలు రోడ్డుపైకి చేరుతున్నాయి. భూగర్భ మురుగునీటి కాలువలులేక ఇబ్బందులు తప్పడం లేదు. పలుచోట్ల కాలువలు శిథిలమవడం, ఇరుగ్గా ఉండటంతో రోడ్లపైనే మురుగు పారుతూ అపరిశుభ్రత తాండవిస్తోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించక ఇబ్బందులు తప్పడం లేదు. జనాభాకు అనుగుణంగా బల్దియాల్లో పారిశుద్ధ్య కార్మికులు లేక సమస్య మరింత జటిలమవుతోంది.

డ్రైనేజీల పొడవు(కి.మీ.లలో)

రామగుండం	32.5
సుల్తానాబాద్	15.0
మంథని	12.5
పెద్దపల్లి	4.5

పట్టించుకునేవారు లేరు



మా కాలనీలో ఏడాదిగా మురుగు లీకవుతున్నది. దుర్వాసనతో నరకయాతన అనుభవిస్తున్నం. ఇండ్ల ముందు కంపునీళ్లు ఉంటే ఎట్లా బతికేది. మా గోసను ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ జర పట్టించుకోవాలి. – రాంపెల్లి శశిరేఖ, శ్రీదుర్గానగర్

సమస్యలకు సత్వర పరిష్కారం

• అడిషనల్ కలెక్టర్ వేణు
• ప్రజావాణిలో అర్జీలు స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్ వేణు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని పలు మండలాలు, గ్రామాలకు చెందిన ప్రజలు ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపాలని అడిషనల్ కలెక్టర్ వేణు సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లాలోని మండలాలు, గ్రామాలనుంచి వచ్చిన ప్రజల నుంచి ఆయన దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించి ప్రభుత్వ సేవలపై నమ్మకం కలిగించాలని ఆయన సూచించారు.

రైతుబంధు ఇప్పించండి

మా ఊరులో నాకు రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. రైతుబంధు రావడం లేదు. పట్టాదారు పాసుపుస్తకం ఆధారంగా రైతుబంధు నా ఖాతాకు జమ అయ్యేలా చూడాలి.
– రమేశ్, పెద్దబొంకూర్

గృహజ్యోతి అమలు చేయాలి

నిరుపేద కుటుంబానికి చెందిన నాకు గృహజ్యోతి పథకం అమలు కావడంలేదు. అన్ని అర్హతలున్నా న్యాయం జరగడంలేదు. విచారణ జరిపి నాకు గృహజ్యోతి ద్వారా ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలి.
– అనూష, కుందనపల్లి, రామగుండం

ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించండి

మాది తాజ్‌కాలనీ. సొంత ఇల్లు లేదు. ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలి. ఇందుకోసం నాకు అన్ని అర్హతలు ఉన్నాయి. విచారణ జరిపించి ఇల్లు మంజూరయ్యేలా చూడాలి.
– అస్మిత్‌జహాన్, పెద్దపల్లి

ఏజీపీగా రవికుమార్

గోదావరిఖనిటౌన్: స్థానిక సీనియర్ సివిల్ కోర్టు ఏజీపీగా నగరానికి చెందిన ముస్కె రవికుమార్‌ను నియమించారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

• మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



పరిహారం చెక్కులు అందిస్తున్న మంత్రి అడ్లూరి

ధర్మారం(ధర్మపురి): ఇందిరమ్మ ప్రభుత్వ పాలనలో అర్హులైన ప్రతీఒక్కరి సంక్షేమ ఫలాలు అందుతాయని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. బొమ్మారెడ్డిపల్లి, చామనపల్లిలో ప్రమాదవశాత్తు మృతిచెందిన గొర్రెలకు రూ.8లక్షల 70వేల పరిహారం చెక్కులను కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి సోమవారం మంత్రి బాధితులకు అందజేశారు. మేడారంలో విద్యుత్ మరమ్మతులు, అభివృద్ధి పనులు, ఇందిరమ్మ ఇళ్లకు మంజూరు పత్రాలు అందజేశారు. ధర్మారంలో ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను ప్రారంభించి మాట్లాడారు. నందిమేడారంలో విద్యుత్ లూస్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలు, ఇళ్లపై విద్యుత్ తీగల తొలగింపు కోసం రూ.26లక్షలు మంజూరు చేశామని, రూ.80లక్షలతో సీసీ రోడ్లు నిర్మించామని తెలిపారు. ధర్మారంలో ఐటీఐ ఏర్పాటుకు జీవో విడుదల చేశామని తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్, వైస్ చైర్మన్ అరిగే లింగయ్య, ఆర్డీవో గంగయ్య, హౌసింగ్ పీడీ రాజేశ్వర్‌రావు, ఇన్‌చార్జి తహసీల్దార్ ఉదయ్‌కుమార్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు. మంత్రికి యాదవసంఘం స్వాగతం పలుకగా, ఆర్యవైశ్య సంఘం నేతలు సన్మానించారు.

ప్రజాసమస్యలు పరిష్కరించాలి

గోదావరిఖని: ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ సూచించారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో ప్రజలను నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. తాగునీటి ఇబ్బందులు, రోడ్ల మరమ్మతులు, డ్రైనేజ్ సమస్యలు, ఆరోగ్యసేవలు, విద్య తదితర అంశాలపై అందిన ఫిర్యాదులను ఆయన పరిశీలించారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

పాలకుర్తి(రామగుండం): పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తున్నదని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ అన్నారు. మండల కేంద్రంతోపాటు కొత్తపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆయన ముగ్గు పోశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. కన్నాల సింగిల్‌విండో చైర్మన్ బయ్యపు మనోహర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్, మాజీ ఎంపీపీ గంగాధర రమేశ్ మాజీ సర్పంచ్ మల్లెత్తుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభం



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): పాలకుర్తి మండలం ఎల్కలపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ భూమిపూజ చేశారు. మాజీ సర్పంచ్ చిట్టబోయిన రాజకుమార్, 14వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు బూర్ల శ్రీనివాస్, రాజిరెడ్డి, బండ రమేశ్‌రెడ్డి, రాకేశ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కుక్కలతో జాగ్రత్త


మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్

కోల్‌సిటీ(రామగుండం): నగరవాసులు కుక్కకాటు బారిన పడకుండా జాగ్రత్త పడాలని రామగుండం నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి సూచించారు. 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా సోమవారం స్థానిక తిలక్‌నగర్ ప్రాంతంలో ఇంటింటా అవగాహన కల్పించారు. వీధికుక్కలు, పిచ్చికుక్కల బారిన పడకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలను పోస్టర్ల ద్వారా ప్రదర్శించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నాగభూషణం, కుమారస్వామి, హెల్త్‌అసిస్టెంట్ సంపత్, మెప్మా సీవోలు ప్రియదర్శిని, శమంతకమణి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ



కమాన్‌పూర్(మంథని): పెద్దపల్లి డీసీపీ కరుణాకర్ సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పాత కేసుల గురించి ఎస్సై ప్రసాద్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్ అవరణలో మొక్కలు నాటారు. గోదావరిఖని టూటౌన్ సీఐ ప్రసాదరావు తదదితరులు ఉన్నారు.

అన్నిరంగాల్లో రాణించాలి


కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో అన్న ప్రసన్న కుమారి

రామగిరి(మంథని): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని డీఎంహెచ్‌వో అన్న ప్రసన్నకుమారి సూచించారు. కల్వచర్ల గ్రామపంచాయతీ పరిధి మారుతీనగర్‌లో రేండ్ల శారద– కుమార్‌స్వామి దంపతులు ఆర్‌ఎస్‌కే ఆపన్నహస్తం ద్వారా ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆమె సోమవారం ప్రారంభించి మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు కుట్టు శిక్షణ ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పిల్లల చేయిపట్టి.. సర్కార్ బడికి జైకొట్టి

- ప్రభుత్వ పాఠశాలకు పంతుళ్ల పిల్లలు
- నమ్మకం కల్పిస్తున్న టీచర్లు
- స్ఫూర్తి పొందుతున్న తల్లిదండ్రులు
- సర్కార్ స్కూళ్లలో పెరుగుతున్న ప్రవేశాలు



తాము పనిచేస్తున్న సర్కార్ స్కూళ్లపై నమ్మకం పెంపొందించడం.. విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యంగా టీచర్లు తమ పిల్లలను తమతోపాటే తీసుకెళ్తున్నారు. ప్రభుత్వ కొలువు చేస్తూ ప్రైవేట్ స్కూళ్లకు పంపడం సరికాదని.. సర్కార్ స్కూళ్లలో చేర్పించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని.. ప్రైవేట్‌కు దీటుగా విద్యాబోధన సాగుతోందంటూ టీచర్లు చాటిచెబుతున్నారు. పిల్లలను తాము పనిచేస్తున్న స్కూళ్లకు తీసుకెళ్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు.

తమతోనే పిల్లలు


ఉపాధ్యాయ దంపతులు పుర్రె రమేశ్, కవితల కూతురు ఆరాధ్య

రాయికల్: జగిత్యాల జిల్లా రాయికల్‌కు చెందిన పుర్రె రమేశ్, కవిత దంపతులు ప్రభుత్వ ఉపాధ్యాయులు. రమేశ్ రాయికల్ హైస్కూల్‌లో పీడీగా, కవిత రాయికల్ మండలం ఇటిక్యాలలోని ప్రైమరీ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నారు. వీరి కూతురు ఆరాధ్యను వారు పనిచేస్తున్న స్కూల్‌లో చేర్పించారు. మొదట్లో కవిత పనిచేసిన భూపతిపూర్‌లో 1 నుంచి 3వ తరగతి, ప్రస్తుతం ఇటిక్యాలలో 4వ తరగతిలో చేర్పించారు.

పిల్లలనూ సర్కార్ బడికే..


భార్య, పిల్లలతో ప్రభుత్వ ఉద్యోగి యామ రాజు

ఇల్లంతకుంట: మండలంలోని వంతడుపుల గ్రామానికి చెందిన రెవెన్యూ ఉద్యోగి యామ రాజు తన ఇద్దరు కూతుళ్లను ప్రభుత్వ బడిలోనే చేర్పించారు. రాజు కూతుళ్లు యామ ధీరజ, తనూజ మండలంలోని రహీంఖాన్‌పేట ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో చదువుతున్నారు. పెద్ద కూతురు ఇంటర్‌లో 987 మార్కులు సాధించి ప్రస్తుతం కోటిలోని ఉమెన్స్ డిగ్రీ కాలేజీలో చేరింది. చిన్నకూతురు తనూజ మోడల్‌స్కూల్‌లో పదో తరగతి చదువుతోంది.

తల్లీకొడుకులు ఒకే బడికి..


కుమారుడు శ్రేయాన్‌తో టీచర్ శ్రీలక్ష్మి

కోరుట్ల: ఈ తల్లులు ప్రభుత్వ టీచర్లు. తమ పిల్లలను సైతం వారు పనిచేస్తున్న స్కూళ్లకు తీసుకెళ్తూ విద్యాబుద్ధులు నేర్పుతున్నారు. కోరుట్ల మండలం అయిలాపూర్‌లో ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న సీహెచ్ శ్రీలక్ష్మీ తన కుమారుడు శ్రేయాన్‌ను అదే స్కూల్‌లో 4వ తరగతిలో చదివిపిస్తున్నారు. నిత్యం తనతోపాటు స్కూల్‌కు తీసుకెళ్తున్నారు. శ్రీలక్ష్మీ మాట్లాడుతూ.. ప్రభుత్వ స్కూళ్లలో స్వేచ్ఛాపూరిత వాతావరణంలో విద్యాభ్యాసం సాగుతోందని, అప్పుడే విద్యార్థుల్లో సృజనాత్మకశక్తి పెరుగుతుందన్నారు.


కుమారుడిని బైక్‌పై స్కూల్‌కు తీసుకెళ్తున్న రాజమణి

కోరుట్లరూరల్: కోరుట్ల మండలం మాదాపూర్ ప్రాథమిక పాఠశాల ఎస్‌జీటీ ఎలిగేటి రాజమణి తన కుమారుడిని అదే పాఠశాలలో చదివిస్తోంది. కోరుట్లకు చెందిన రాజమణి తన కొడుకు హిమాన్స్‌ను తాను పనిచేస్తున్న స్కూల్‌లోనే 3వ తరగతిలో చేర్పించింది. నిత్యం బైక్‌పై కొడుకును తీసుకొని స్కూల్‌కు వెళ్లి వస్తోంది. రెండేళ్ల క్రితం ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండిలో పనిచేసే సమయంలోనూ తన కొడుకును తీసుకెళ్లేవారు. ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ బోధన అందుతుండడంతోనే తీసుకెళ్తున్నట్లు రాజమణి తెలిపారు.

బోధనపై నమ్మకంతో..


కూతురు మధురిమను 9వ తరగతిలో చేర్పించిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కిష్టయ్య

వేములవాడ: కథలాపూర్ స్కూల్‌లో పనిచేస్తున్న టీచర్ కిష్టయ్య తన కూతురు మధురిమను వేములవాడలోని బాలికల హైస్కూల్‌లో చేర్పించారు. ప్రస్తుతం 9వ తరగతి చదువుతోంది. ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందనే చేర్పించినట్లు కిష్టయ్య పేర్కొన్నారు.

జమ్మికుంట: ప్రభుత్వ పాఠశాలలో బోధనపై నమ్మకం కల్పించేందుకు తన కుమారుడిని చేర్పించినట్లు టీచర్ బానోత్ సత్యజోస్ తెలిపారు. భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం పర్లపల్లిలోని స్కూల్‌లో సత్యజోస్ టీచర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. జమ్మికుంటలో ఉంటున్నారు. ఏడాది క్రితం బదిలీపై పర్లపల్లి పాఠశాలకు వచ్చారు. తన కొడుకు బానోతు సుశాంత్‌ను జమ్మికుంట హైస్కూల్‌లో 9వ తరగతిలో చేర్పించారు.

నాన్న వెంటే పిల్లలు


పిల్లలతో ఉపాధ్యాయుడు సత్యనారాయణ

కరీంనగర్‌స్పోర్ట్స్: తాము పనిచేస్తున్న ప్రభుత్వ పాఠశాలలకు తమ పిల్లలను తీసుకెళ్తున్నారు ఈ తండ్రులు. వీరిని చూసి గ్రామంలోని తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను సర్కార్ బడులకు పంపుతున్నారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం ఒద్యారం గ్రామానికి చెందిన సత్యనారాయణ ప్రస్తుతం వేములవాడలోని జెడ్పీ హైస్కూల్(బాలికలు)లో విధులు నిర్వర్తిస్తున్నారు. కరోనా సంక్షోభానికి ముందు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తూ పిల్లలనూ అక్కడే చదివిపించేవారు. అనంతరం ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం రావడంతో తాను పనిచేస్తున్న స్కూల్‌కే తన పిల్లలను తీసుకెళ్తున్నారు. పెద్ద కూతురు అనన్య ప్రభాస 8వ తరగతి, చిన్నకూతురు ప్రవస్థి 5వ తరగతి చదువుతున్నారు.


ఉపాధ్యాయుడు సతీశ్, కుమారుడు వరుణ్‌తేజ్

కథలాపూర్(వేములవాడ): మండలంలోని దుంపేట ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న లింగంపేట సతీశ్ తన కొడుకు వరుణ్‌తేజ్ అదే స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నారు.


కుమారునితో పాఠశాలకు వస్తున్న తీపిరి సంజీవ్

కోనరావుపేట: కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన తీపిరి సంజీవ్ స్థానిక మండల పరిషత్ పాఠశాలలో పనిచేస్తున్నారు. తన కుమారుడు జయసూర్యని కూడా అదే పాఠశాలలో రెండో తరగతి చదివిస్తున్నారు. ప్రతి రోజూ తండ్రీ కొడుకులు బైక్‌పై స్కూల్‌కు వెళ్లి వస్తున్నారు.


కొడుకును తీసుకెళ్తున్న ఉపాధ్యాయుడు రాజు

ధర్మపురి: ధర్మపురి మండలం రాయపట్నం స్కూల్‌లో పనిచేస్తున్న బండారు రాజు తన కొడుకు రోహన్‌ను అదే బడిలో 3వ తరగతిలో చేర్పించారు. గతంలో వెల్గటూర్ మండలం కిషన్‌రావుపేటలో పనిచేసిన సమయంలో తన వెంటే కొడుకును తీసుకెళ్లారు.


పిల్లలతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు జావెద్

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని జెడ్పీ హైస్కూల్‌లో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న జావెద్ తన పిల్లలను అదే బడిలో చదివిపిస్తున్నారు. తన పెద్ద కొడుకు నవీదుల్ రెహమాన్‌ను అదే స్కూల్‌లో 7వ తరగతి, చిన్న కొడుకు టిప్పు ఉల్ రహమాన్‌ను దుర్గయ్యపల్లి స్కూల్‌లో 4వ తరగతిలో చేర్పించాడు.

విద్య వ్యాపారం కాదని..


నర్సింహులపల్లి స్కూల్‌లో కూతురుతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మధుసూదన్

సారంగాపూర్: ప్రస్తుతం విద్యను వ్యాపారం చేసేశారని.. కాదని చెప్పేందుకే తన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివిపిస్తున్నట్లు గొడుగు మధుసూదన్ తెలిపారు. బీర్‌పూర్ మండలం నర్సింహులపల్లికి చెందిన మధుసూదన్ కండ్లపల్లిలో టీచర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. పెద్ద కుమార్తె నిత్య 10వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదివి ప్రస్తుతం ఇంటర్మీడియెట్‌లో చేరింది. చిన్న కూతురు శ్రీనిధి నర్సింహులపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. కండ్లపల్లిలో విధులు నిర్వహిస్తూనే నర్సింహులపల్లిలోని స్కూల్‌కు వెళ్లి అదనంగా ఒక పీరియడ్ బోధిస్తున్నారు.

డిగ్రీ సీట్ల నిర్ధారణ నేటితో ఆఖరు


శాతవాహన యూనివర్సిటీ

- మూడోదశ సీట్ల కేటాయింపు పూర్తి
- మిగిలిన సీట్లు స్పాట్ అడ్మిషన్లతో భర్తీ
- తగ్గుతున్న డిగ్రీ సీట్ల భర్తీ

కరీంనగర్‌టౌన్: డిగ్రీ ప్రవేశాల ప్రక్రియ మూడు దశలు పూర్తయ్యాయి. మూడో దశ సీట్ల కేటాయింపు చేపట్టారు. ఇందులో శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని మొత్తం కళాశాలల్లో 36,060 సీట్లకు గాను మొదటి, రెండో విడతలో 9,455 సీట్లు కేటాయించగా, 6,730 మంది విద్యార్థులు అడ్మిషన్ ఖరారు చేసుకున్నారు. ఇంకా 29,330 సీట్లు ఖాళీగా ఉండగా మూడో విడతలో 7,629 సీట్లు కేటాయించింది. మూడో విడతలో 13 ప్రభుత్వ కళాశాలలో 1,060 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించడం జరిగింది. అలాగే మూడు ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో 1,046 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించారు. 60 ప్రైవేట్ కళాశాలల్లో 5,523 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించారు.

నేటితో ఆఖరు

శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల వివరాలు...

ప్రభుత్వ కళాశాలలు	– 13
ప్రభుత్వ అటానమస్ కళాశాలలు	– 02
ప్రైవేట్ ఎయిడెడ్	– 02
ప్రైవేట్ అన్ ఎయిడెడ్	– 58
సోషల్ వెల్ఫేర్	– 03
ట్రైబల్ వెల్ఫేర్	– 02
బీసీ వెల్ఫేర్	– 03

ఇప్పటికీ మూడు దఫాల్లో సీట్లు కేటాయింపు కాగా ఆయా విద్యార్థులు ప్రవేశాలు ఆన్‌లైన్‌లో చూసుకోవాల్సి ఉంటుంది. దీనికి జూలై 1వతేదీ వరకు అవకాశం ఉంది. సీటు కన్ఫార్మ్ చేసుకోలేకపోతే రద్దవుతుందని శాతవాహన దోస్త్ అధికారులు తెలుపుతున్నారు. గతంలో కంటే తక్కువగానే సీట్ల భర్తీ జరుగుతుందని తెలుస్తోంది.

మిగిలింది స్పాట్ అడ్మిషన్లతోనే...

శాతవాహన యూనివర్సిటీలో మూడు దఫాల్లో అడ్మిషన్ల కేటాయింపు పూర్తికాగా మూడో దశలో సీటు కన్ఫార్మ్ చేసుకున్న తర్వాత ఎన్ని సీట్లు మిగిలాయో పూర్తిస్థాయిలో తెలుస్తుంది. తర్వాత మిగిలిన సీట్లు స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేసుకునే అవకాశం కల్పించనున్నట్లు సమాచారం. విద్యార్థులు మొత్తం బీటెక్, మెడిసిన్‌తో పాటు వివిధ కోర్సుల వైపు ఆసక్తి చూపడంతో డిగ్రీ సీట్ల భర్తీ పడిపోతుందని విద్యావేత్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

శాతవాహన యూనివర్సిటీలో అందుబాటులో ఉన్న సీట్లు, భర్తీ వివరాలు...
శాతవాహనలో అందుబాటులో ఉన్న మొత్తం సీట్లు: 36,060

విద్యా సంవత్సరం	సీట్ల భర్తీ
2022–23	20218
2023–24	16419
2024–25	16500
2025–26	7629

(రెండు దశలు పూర్తయ్యాక)

సిమ్స్‌లో వసతులపై ఆరా


మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలోని సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ కాలేజీ(సిమ్స్)తోపాటు జీజీహెచ్ టీచింగ్ ఆస్పత్రిని నేషనల్ మెడికల్ కౌన్సిల్ నియమించిన రాష్ట్ర కమిటీ సోమవారం సందర్శించింది. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(అకడమిక్) శివరాం ప్రసాద్, టీఎస్‌ఎండీసీ ఈఈ విశ్వప్రసాద్ తదితరులు మెడికోల హాస్టల్, టీచింగ్ ఆస్పత్రిలో మౌలిక వసతులు, ఫ్యాకల్టీ, సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ కోయ శ్రీహర్షతో చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ, మెడికల్ కాలేజీతోపాటు జీజీహెచ్ టీచింగ్ ఆస్పత్రిలో మౌలిక వసతుల కల్పన, ఫ్యాకల్టీ వివరాలపై రాష్ట్ర ప్రభుత్వం నివేదిక తయారు చేయడానికి ప్రత్యేక కమిటీని రూపొందించిందన్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ నరేందర్, ఆర్‌ఎంవో రాజు, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు తదితరులు పాల్గొన్నారు.

డిస్మిస్ జేఎంఈటీలకు ఉద్యోగాలు

గోదావరిఖని: సింగరేణిలో వివిధ కారణాలతో డిస్మిస్ అయిన 143 మంది జేఎంఈటీలకు ఉద్యోగాలు ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరించినట్లు ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. జూన్ 27న కొత్తగూడెంలో జరిగిన స్ట్రక్చరల్ కమిటీ సమావేశంలో ఒప్పందం వివరాలను ఆయన సోమవారం వెల్లడించారు. క్లరికల్ విభాగంలో ఖాళీగా ఉన్న పోస్టులను మెరిట్ ఆధారంగా, మైనింగ్ స్టాఫ్, ట్రేడ్స్‌మెన్ ఖాళీ పోస్టులను భర్తీ చేసేందుకు, యాక్టింగ్ క్లర్క్‌లకు ప్రమోషన్‌లు ఇచ్చేందుకు, క్యాంటీన్ కార్మికులకు సబ్సిడీ పెంచేందుకు ఒప్పుకుందన్నారు. స్వామి, ఆరెల్లి పోశం, మల్లికార్జున్, రమేశ్ కుమార్ పాల్గొన్నారు.

పెరిగిన రాజకీయ జోక్యం

రామగిరి(మంథని): సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగి సంస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య ఆందోళన వ్యక్తం చేశారు. ఏపీఏ గనిపై ఫీట్ సెక్రటరీ గంగాధర్ అధ్యక్షతన నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. నాయకులు వైవీరావు, ఎం.రాంచంద్రారెడ్డి, బండారి క్రాంతికిరణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ యూనియన్‌లకు చెందిన 40 మంది ఏఐటీయూసీలో చేరారు.

బొగ్గు గనుల పరిరక్షణ లక్ష్యం

గోదావరిఖని: బొగ్గు గనుల పరిరక్షణ లక్ష్యంగా ఈనెల 9న చేపట్టే ఒకరోజు సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొనాలని విప్లవ కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు కోరారు. స్థానిక ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. రియాజ్ అహ్మద్, కృష్ణ, రాములు, ఏడుకొండలు, శేఖర్, నరేశ్, రాజేశం, రవీందర్, రాజన్న, మల్లేశం పాల్గొన్నారు.